క్లుప్తంగా

సత్యమ్మ తల్లి జాతర ప్రారంభం



నందిగామ: మండలంలోని అంబారుపేటలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏటా చైత్ర మాసంలో ఐదు రోజుల పాటు జరిపే జాతర కార్యక్రమాల్లో భాగంగా మొదటి రోజు అమ్మవారికి పంచామృతాభిషేకాలతో పాటు పలు రకాల పూజలు నిర్వహించారు. తెల్లవారు జామునే మంగళ వాయిద్యాలతో సుప్రభాత సేవ, మహా గణపతి పూజ, పుణ్యాహ వచనం, దీక్ష ధారణ, అఖండ దీప స్నపన, కలశ స్నపన, మండపారాధన కార్యక్రమాలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గర్భిణులకు అవగాహన సదస్సు

అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): పోషణ్ పక్వాడా ఉత్సవాల్లో భాగంగా స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు శనివారం పోషకాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పోషకాహార విలువలు, జాగ్రత్తలను వివరించారు. సర్పంచ్ బి.జ్యోతిబ్రహ్మం పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

నందిగామ(చందర్లపాడు): మండలంలోని పాత బెల్లంకొండవారిపాలెంలో శనివారం క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని జై భీమ్ ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ పోటీలో పలు గ్రామాలకు చెందిన జట్లు పాల్గొన్నాయి.

సాయికి సత్కారం



నందిగామ: కళామతల్లి ముద్దుబిడ్డ బబ్బెల్లపాటి గోపాలకృష్ణ సాయి లాంటివారు నందిగామ ప్రాంత వాసి కావడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని సత్తెమ్మ తల్లి ఆలయ మాజీ చైర్మన్ గరికపాటి భాస్కరం (నానయ్య) అన్నారు. ఇప్పటికే ఎన్నో పురస్కారాలను దక్కించుకున్న గోపాలకృష్ణ సాయిని ఇటీవల ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సత్కరించింది. ఈ నేపథ్యంలో శనివారం మండలంలోని అంబారుపేట గ్రామంలో సాయిని సన్మానించారు.

నాణ్యమైన భోజనమందించాలి

ధర్మవరప్పాడుతండ(జగ్గయ్యపేట): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు నాణ్యమైన భోజనమందించాలని ఎంపీడీఓ జయచంద్ర పేర్కొన్నారు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన దాత భూక్యా మంగ్యానాయక్ వితరణతో స్టీలు గ్లాసులను శనివారం ఆయన పంపిణీ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల్లో నాణ్యమైన భోజనంతో పాటు రాగిజావను కూడా అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మణి హుసేన్, ఎంఈఓ రవీంద్ర పాల్గొన్నారు.

హౌసింగ్ ఇన్‌చార్జ్ డీఈగా ఖాదర్ వలీ

చిల్లకల్లు(జగ్గయ్యపేట): జగ్గయ్యపేట హౌసింగ్ ఇన్‌చార్జ్ డీఈగా నందిగామ డీఈగా పని చేస్తున్న ఖాదర్ వలీ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జ్‌గా ఏఈ ప్రకాశరావు బాధ్యతలు నిర్వహించారు. ఆయన స్థానంలో హౌసింగ్ ఉన్నతాధికారులు ఖాదర్ వలీని ఇన్‌చార్జ్ డీఈగా నియమించారు.

భూముల రీ సర్వేతో వివాదాలకు చెక్

వీరులపాడు: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా జరుగుతున్న భూముల రీ సర్వేతో భూ వివాదాలు సమసిపోతాయని తహసీల్దార్ ఆశయ్య నాయక్ పేర్కొన్నారు. మండలంలోని వీఅన్నవరం, దొడ్డదేవరపాడులో జరుగుతున్న రీ సర్వేను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్వే ద్వారా భూ రికార్డుల ప్రక్షాళన చేసి, భూ కమతానికి విశిష్ట గుర్తింపు కేటాయించనున్నట్లు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ అంజనేయులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- రేపటి నుంచి పరీక్షలు
- పలు పాఠశాలల్లో సీసీ కెమెరాల ఏర్పాటు



పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న ఎంఈఓ రవీందర్

జగ్గయ్యపేట అర్బన్: ఈ నెల మూడో తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు పట్టణంతో పాటు మండలంలోని అన్ని సెంటర్లలో ఏర్పాట్లు పూర్తయినట్లు ఎంఈఓ డి.రవీందర్ తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీ నుంచి 18 వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పేట పట్టణంలో 7 సెంటర్లను ఏర్పాటు చేయగా, పేట మండలంలో మూడు సెంటర్లతో కలిపి మొత్తం 10 సెంటర్లలో 1,676 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. వారిలో రెగ్యులర్ 1,632, ప్రైవేటుగా 44 మంది హాజరుకానున్నారని పేర్కొన్నారు. పేటలో స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్లో–2 సెంటర్లు, బాలికల హైస్కూల్ 1, విజ్ఞాన్ హైస్కూల్ 1, శ్రీచైతన్య 1, తపోవన్ విద్యాలయం 1, చేగు విద్యాలయం ఉన్నాయి. అలాగే పేట మండలంలో చిల్లకల్లు జెడ్పీ హైస్కూల్ 1, ఆల్ సెయింట్స్ హైస్కూల్ 1, గండ్రాయిలో జెడ్పీ హైస్కూల్ 1 ఉన్నాయి. విద్యార్థులు ఏ స్కూల్ యూనిఫాం ఉపయోగించకూడదని తెలిపారు. అన్ని సెంటర్లలో ఫర్నిచర్, తాగునీరు, ఫ్యాన్లు తదితర వసతి సౌకర్యాలను కల్పించినట్లు పేర్కొన్నారు.

అన్ని సెంటర్లలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారని, పరీక్షల నిర్వహణకు సంబంధించి జంబ్లింగ్ ఇన్విజిలేటర్ల వ్యవస్థ అమలులో ఉంటుందన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు సకాలంలో వారికి కేటాయించిన సెంటర్లకు చేరుకోవాలని, ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఆయన కోరారు. ఉదయం 9.30కు ప్రారంభమై 12.45 గంటల వరకు జరుగుతాయని తెలిపారు.

పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు బస్ ఫ్రీ

పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత ఆర్టీసీ బస్ ప్రయాణసౌకర్యం కల్పిస్తున్నట్లు ఎంఈఓ తెలిపారు. సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించిన సెంటర్లలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేస్తున్నారు.

మూడు పరీక్ష కేంద్రాల ఏర్పాటు

పెనుగంచిప్రోలు: పదో తరగతి పరీక్షలకు సంబంధించి మండల కేంద్రం పెనుగంచిప్రోలులో మూడు సెంటర్లు ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ రవీంద్ర శనివారం తెలిపారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టమెంట్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లను ఇప్పటికే నియమించినట్లు పేర్కొన్నారు. మండలంలో మొత్తం మూడు సెంటర్లలో పరీక్షలు నిర్వహించనున్నారు. వీటిలో పెనుగంచిప్రోలులోని కేవీఆర్ జెడ్పీ(బాలుర) హైస్కూల్, జెడ్పీ బాలికల హైస్కూల్, శ్రీచైతన్య టెక్నో స్కూల్ ఉన్నాయన్నారు. మూడు సెంటర్లలో మొత్తం 484 మంది విద్యార్థులు మండలంలో పరీక్షలకు హాజరు కానున్నారన్నారు.

వత్సవాయిలో..

వత్సవాయి: పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ ఎల్.నాగరాజు శనివారం తెలిపారు. మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు మొత్తం 386 మంది పరీక్షలు రాయనున్నారు. వత్సవాయి జెడ్పీ పాఠశాలలో రెండు సెంటర్లు ఏర్పాటుచేయగా ఎ– సెంటర్‌లో 187 మంది, బి– సెంటర్‌లో 189 మంది విద్యార్థులను కేటాయించారు.

మహిళల ఆర్థికాభివృద్ధికే ఆసరా

మండలంలో రూ.13.67 కోట్ల లబ్ధి



చిల్లకల్లులో ఆసరా నమూనా చెక్కు అందజేస్తున్న విప్ ఉదయభాను

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మూడో విడత ఆసరా పథకం నమూనా చెక్కులను శనివారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు వరుసగా మూడో విడతగా ఆసరా అందించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. డ్వాక్రా సంఘాలను పటిష్టం చేసేందుకు ముఖ్యమంత్రి చేస్తున్న కృషి మరువలేనిదన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఆసరా పథకం ద్వారా రూ. 48 కోట్ల మేర మహిళలకు లబ్ధి చేకూరగా మండలంలో 1,623 డ్వాక్రా సంఘాలకు రూ.13.67 కోట్లు మహిళల ఖాతాలో జమయ్యాయని తెలిపారు. అదే విధంగా స్త్రీ నిధి ద్వారా 860 మందికి రూ. 4.30 కోట్లు జమవుతాయని తెలిపారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ప్రతి సంక్షేమ పథకాన్ని అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముత్తినేని విజయశేఖర్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శ్యామల, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిలుకూరి శ్రీనివాసరావు, మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రామారావు, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సంపత విజిత, ఎంపీడీఓ జయచంద్ర, ఏపీఎం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి దాతలు సహకరించాలి

ఎమ్మెల్సీ అరుణకుమార్



ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామ టౌన్: గ్రామాల అభివృద్ధికి దాతల సహకారం అవసరమని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. మండలంలోని పల్లగిరి గ్రామంలో దాతలు మానుకుంద సత్యనారాయణ దంపతుల సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక కృషి చేస్తున్నారన్నారు. ముఖ్యంగా గ్రామాలలో ప్రజలకు అవసరమైన అన్ని వసతులు కల్పించడంతో పాటు పట్టణాలకు దీటుగా పల్లెలను అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారని గుర్తు చేశారు.

ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వంతో పాటు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అరుణకుమార్ పేర్కొన్నారు. ముఖ్యంగా వేసవిలో ప్రజల అవసరాల దృష్ట్యా గ్రామంలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. గ్రామాల అభివృద్ధికి దాతలు ముందుకు వస్తున్నారని భవిష్యత్‌లో మరింతగా సహకరించాలని కోరారు. అనంతరం ఆర్వో ప్లాంట్ దాత సత్యనారాయణ రెడ్డి దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చాగంటి రవికిరణ్‌రెడ్డి, ఉప సర్పంచ్ చిలుకూరి బుచ్చిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు వేల్పుల రాము, కోఆప్షన్ సభ్యుడు అలీషా, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

సుపరిపాలనకు ఆకర్షితులవుతున్న ప్రతిపక్ష నాయకులు

- టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరికలు
- కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్సీ అరుణకుమార్



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామ టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలనకు ప్రతిపక్ష పార్టీ నాయకులు సైతం ఆకర్షితులవుతున్నారని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. చందర్లపాడు మండలంలోని పోపూరు ఉప సర్పంచ్ కోట బాబురావు, వార్డు సభ్యులు బెల్లంకొండ శ్రీనివాసరావు, రంగా శేషగిరిరావుతో పాటు 20 కుటుంబాలు తెలుగుదేశం పార్టీని వీడి అరుణకుమార్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి అరుణకుమార్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో 175 స్థానాలకు 175 స్థానాలు గెలవబోతున్నామన్నారు.

విశేష ఆదరణ

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని ఎమ్మెల్సీ అరుణకుమార్ తెలిపారు. సామాన్య ప్రజల నుంచే కాకుండా ప్రతిపక్ష పార్టీల నాయకులు సైతం ముఖ్యమంత్రి పాలనకు ముగ్ధులై వైఎస్సార్ సీపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. నందిగామ నియోజకవర్గంలో సైతం మరోసారి విజయం సాధించి ముఖ్యమంత్రికి కానుకగా అందించబోతున్నామని తెలిపారు. రాష్ట్రంలో అవినీతి రహిత పాలన సాగుతుందన్నారు. వైఎస్సార్ సీపీలో చేరిన వారు పార్టీ అభివృద్ధికి, రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ వెలగపూడి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, నాయకులు బెల్లంకొండ వెంకట నరసయ్య, తంగం ముత్యాలరెడ్డి, లాజరు, చింతోటి ప్రసాద్, సత్యం పాల్గొన్నారు.

వర్షాలతో రైతుల ఆందోళన

పెనుగంచిప్రోలు: మండలంలో శుక్ర, శనివారం కురిసిన భారీ వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ వర్షాలకు మొక్కజొన్న నేలవాలింది. మండలంలో సుమారుగా 200 ఎకరాల్లో మొక్కజొన్నకు నష్టం వాటిల్లిందని ఏఓ రామసుబ్బారెడ్డి తెలిపారు. సిబ్బంది నష్టాన్ని అంచనా వేస్తున్నారని పేర్కొన్నారు.

నేడు పట్టణంలో వైఎస్సార్ ఆసరా కార్యక్రమం

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వైఎస్సార్ ఆసరాకు సంబంధించి మూడో విడత విడుదల చేయు కార్యక్రమం పట్టణంలో ఆదివారం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ మల్లేశ్వరరావు శనివారం తెలిపారు. స్థానిక ఉక్కు కళావేదికలో మధ్యాహ్నం రెండు గంటలకు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ముఖ్య అతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. పట్టణానికి చెందిన డ్వాక్రా మహిళలంతా పాల్గొనాలని కోరారు.

గృహ ప్రవేశాల లక్ష్యాన్ని 100 శాతం పూర్తిచేయాలి



గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న కమిషనర్ మల్లేశ్వరరావు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పట్టణంలోని జగనన్న కాలనీకి చెందిన లబ్ధిదారుల గృహ ప్రవేశాల లక్ష్యాన్ని 100 శాతం పూర్తిచేయాలని మున్సిపల్ కమిషనర్ చందవోలు మల్లేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని బలుసుపాడు రోడ్‌లో ఉన్న జగనన్న కాలనీ ఎల్పీ–2 లే అవుట్‌లో నిర్మాణంలో ఉన్న గృహాలను హౌసింగ్, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి కమిషనర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినందున పట్టణంలోని జగనన్న కాలనీ లబ్ధిదారులందరూ గృహ నిర్మాణాలు పూర్తిచేసుకున్న వారు గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉండాలన్నారు. ఇంకనూ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయని వారు వెంటనే పూర్తిచేయాలని తెలిపారు. హౌసింగ్ ఏఈ శివాజీ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో చురుగ్గా వ్యవహరించాలి



రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్ జయరాం

నందిగామ: సచివాలయ ఉద్యోగులు ప్రజల సమస్యల పరిష్కారం విషయంలో చురుగ్గా వ్యవహరించాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం సూచించారు. పట్టణంలోని 10వ సచివాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఇందులో భాగంగా సచివాలయానికి వచ్చిన వారిని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయంలోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు బాధ్యతాయుతంగా పనిచేయాలని, అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఈ నెల మూడో తేదీ నుంచి పంపిణీ చేయనున్న పెన్షన్‌దారుల వివరాలు అడిగి తెలుసుకోవడంతోపాటు వారికి పంపిణీ చేయవలసిన నగదును సిద్ధం చేసుకోవాలని సూచించారు.

పశువులకు నాణ్యమైన వైద్యం అందించాలి



పశు వైద్యశాలకు బీరువా, కుర్చీలు అందజేస్తున్న విప్ ఉదయభాను

గౌరవరం(జగ్గయ్యపేట): గ్రామీణ ప్రాంతాల్లో పశువులకు నాణ్యమైన వైద్యమందించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేర్కొన్నారు. గ్రామంలోని పశువైద్యశాలకు ఆయన వితరణతో బీరువాలు, కుర్చీలు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ ఈ ప్రాంతంలో పాడిపరిశ్రమ అభివృద్ధి చెందుతోందన్నారు. పశువులకు వ్యాధులు వచ్చినప్పుడు వైద్యులు సకాలంలో స్పందించి వైద్యమందించాలని సూచించారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో సంచార పశువైద్య వాహనాలను ఏర్పాటు చేసి సకాలంలో వైద్య సేవలందిస్తుందన్నారు. గత ప్రభుత్వంలో పశు వైద్యశాలల్లో సరైన సౌకర్యాలు లేక సరైన వైద్యమందక మృత్యువాత పడి పాడి రైతులు నష్టపోయారని గుర్తు చేశారు. కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ బాలసైదా, మాజీ సర్పంచ్ గోవా రామకృష్ణ, పశు వైద్యాధికారి సాంబిరెడ్డి, నాయకులు శ్రీనివాసరావు, మల్లేశ్వరరావు, రమేష్, జగదీష్, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

కబడ్డీ విజేతలకు అభినందన



టోర్నమెంట్ గెలుచుకున్న విద్యార్థులతో కరస్పాండెంట్ రామ్మోహన్‌రావు

పరిటాల(కంచికచర్ల): మండలంలోని పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు జేఎన్‌టీయూ కే నిర్వహించిన సెంట్రల్ జోన్ కబడ్డీ పోటీలలో ప్రతిభ కనపర్చి బహుమతులు గెలుచుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్ అన్నారు. శనివారం కళాశాలలో కబడ్డీ విజేతలను అభినందించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ కే రామ్మోహన్ రావు మాట్లాడుతూ గుడ్లవల్లేరు వేదికగా నిర్వహించిన సెంట్రల్ జోన్ కబడ్డీ పోటీలలో మొత్తం ఐదు జిల్లాల నుంచి 60 జట్లు పోటీ పడగా తమ కళాశాల జట్టు ప్రతిభ కనపర్చి టోర్నమెంట్ గెలుచుకున్నట్లు తెలిపారు. అనంతరం కళాశాలలో అభినందించారు. అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ పీ చిరంజీవి, పీడీలు శ్రీనివాసరావు, పీ శివరామకృష్ణ పాల్గొన్నారు.

టిఫిన్ డబ్బులు అడిగినందుకు దాడి



రామారావును పరామర్శిస్తున్న కేడీసీసీ చైర్మన్

చిల్లకల్లు(జగ్గయ్యపేట): హోటల్లో టిఫిన్ బిల్లు అడిగినందుకు ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటన చిల్లకల్లు గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామంలోని పోలీస్ స్టేషన్ పక్కనే కొంత కాలంగా రామారావు హోటల్ ఉంది. గ్రామానికి చెందిన మాడుగుల జాన్‌బాబు, కందుల శ్యాంలు రాత్రి సమయంలో టిఫిన్ చేసేందుకు వచ్చారు. అనంతరం హోటల్ సిబ్బంది బిల్లు అడగడంతో డబ్బులు ఇవ్వబోమంటూ సిబ్బందితో ఘర్షణ పడ్డారు. దీంతో బయటకు వెళ్లిన ఇద్దరు మద్యం తాగి వచ్చి మరోసారి సిబ్బందితో ఘర్షణ పడడంతో గతంలో కూడా డబ్బులు ఇవ్వాలని సిబ్బంది అడగటంతో హోటల్ యజమాని రామిశెట్టి రామారావు వద్దకు వెళ్లి కర్రతో దాడి చేశారు. రామారావును జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆస్పత్రిలో బాధితుడిని కేడీసీసీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు పరామర్శించారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

భీమవరం(వత్సవాయి): ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ బి.సుజాత తెలిపారు. ఇటీవల మరణించిన లింగాల చిట్టిబాబు కుటుంబసభ్యులకు వైఎస్సార్ బీమా కింద రూ.10 వేలు చెక్కును శనివారం మట్టిఖర్చుల కింద అందిచారు. మిగతా నగదును త్వరితగతిన అందించేందుకు కృషిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సొసైటీ అధ్యక్షుడు చింతకుంట్ల వెంకటరెడ్డి, కొమెర సాయిబాబు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

మైలవరం: స్థానిక డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో నిరుద్యోగులకు మూడు నెలలు ఉచిత శిక్షణ ఇస్తామని క ళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి శనివారం తెలిపారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో 30 మందికి, లోన్ రికవరీ ఏజెంట్లుగా 30 మందికి శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుకున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. వివరాలకు 82477 66718, 91826 26686 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మునుకుళ్లలో పొలంబడి

తిరువూరురూరల్: మండలంలోని మునుకుళ్ల గ్రామంలో శనివారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వరిపొలంలో ప్రస్తుతం గింజ గట్టి పడే దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు తిరువూరు ఏడీఏ కెనడీ అవగాహన కల్పించారు. క్రమంగా నీటి స్థాయిని తగ్గించి పైరు ఎదుగుదలలో తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

200 పశువులకు టీకాలు

ఆంజనేయపురం(తిరువూరురూరల్): మండలంలోని ఆంజనేయపురంలో శనివారం పశువులకు గాలికుంటు వ్యాధినిరోధక టీకాలు వేశారు. సీజనల్ వ్యాధుల బారిన పశువులు పడకుండా టీకాలు విధిగా వేయించాలని పశువైద్యాధికారి స్వప్న రైతులకు సూచించారు. గ్రామంలో 200 పశువులకు టీకాలు వేశారు.

సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలి



పూడిక తీత పనులు ప్రారంభిస్తున్న విప్ ఉదయభాను

గౌరవరం(జగ్గయ్యపేట): రైతులు సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. మండలంలోని గౌరవరం వద్ద శనగపాడు–2 సాగర్ కాలువలో పూడిక తీత పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువలో 0 నుంచి 4 కి.మీ. వరకు ఈ పూడిక తీత పనులు చేపట్టటం జరుగుతుందన్నారు. రెండు, మూడు రోజుల్లో పనులు పూర్తి చేసి రైతులకు సాగునీటి సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు పూట్ల నాగమణి, మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రామారావు, డీసీ మాజీ ఉపాధ్యక్షుడు వాసు, వైఎస్సార్ సీపీ నాయకులు నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, బాలసైదా, రవి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.